# సుకన్యటి... ...రామచంద్రపురం

పువ్వులాంటి గ్లాస్కో లాల్చీకి పునుగూ పిఠాపురం సెంటు కలిపి రాసుకున్న మందపాటి చిట్టిబాబురాజుగారు ఎక్కిన జట్కాబండి కోలంక రాజవీధి దాటి నెహ్రూ బొమ్మసెంటరు దగ్గర్నించి అచ్చమ్మ కాఫీ హోటేలు, పచ్చిపులుసుషావుకారు ఫేన్సీకొట్టు. గోన తాతారావు కిళ్ళీకొట్టూ దాటి ద్రాక్షారం రోడ్డు ఎక్కి ఉరుకులూ పరుగుల మీద ముందుకెళ్తుంది.


దీపాలవేళయ్యింది.

చల్లనిగాలి తిరిగింది.

పచ్చని పొలాల మధ్యలో ఉన్న టెలిఫోన్ స్తంభానికి అందంగా అల్లుకుపోయింది దొండపాదు. బొబ్బాసిచెట్టుకి గేదెనెవడో కట్టేసేడు. పలుపుతాడుని బలంగా ఆ గేదె లాగుతుంటే చెట్టెక్కడ నేలకూలుద్దా అన్నట్టుంది. చింతచెట్టు చిక్కని నీడలో కూర్చుని నాగలి చెక్కుతున్నాడు ముసలితాతబ్బాయి. రకరకాల ఊళ్ళు దాటుకుంటూ రామచంద్రపురం ఊళ్ళోకొచ్చిన చిట్టిబాబురాజుగారి జట్కా లలితావాచ్ కంపెనీ అవతల వీధిలో జయస్తుతిమేష్టారి ఇంటి పక్కనున్న సుకన్యగారి గాలిమేడ దగ్గర కెళ్తుంది.

ఆ ప్రాంతాల్లో చాలా మంది ఒకసారి సుకన్యని రుచి చూసి చచ్చిపోవాలని కోరుకుంటారు. కాస్త తాగాకా ఆ మనిషిరెచ్చిపోయే తీరు కథలు కింద చెప్పుకుంటారు. ఊపిరి సలపనియ్యదట. వందమంది ఆ మనిషికోసం ప్రయత్నాలు చేస్తే ఏ ఒక్కడ్నో కరుణిస్తదట. అసలు తను ఎవడ్ని కటాక్షిస్తదో ఎవడ్ని విసిరికొడదో తెల్దట.

మందపాటి చిట్టిబాబురాజుగారి జట్కా సుకన్య ఇంటిముందు ఆగడం అప్పుడే మెరుపులాగ లోపల్నుంచి వచ్చిన సుకన్య అంతదూరం



నించి పనిగట్టుకు మరీ వచ్చిన రాజుగారి కేసి కన్నెత్తయినా చూడకుండా పన్నెత్తయినా పలకరించకుండా ఆగున్న రిక్షాలోకి దూకేసింది.

రామచంద్రపురం నించి సరాసరి పసలపూడి ఊళ్ళో కొచ్చేసిన సుకన్య రిక్షా సుబ్బారాయుడిగుడి వీధిలో బ్రాకెట్టు ఆదిరెడ్డిగారింటి అవతలున్న నేత పనిచేసే ఊటుకూరి రవణ ఇంటి ముందు ఆగింది.

రిక్షాలోంచి ఒక్క దూకు దూకి చెంగుచెంగు మంటా రవణ ఇంట్లోకి వచ్చేసిన సుకన్య మగ్గంగోతిలో కూర్చున్న బక్కగా ఉండే రవణగాడి రెక్కట్టుకు పైకి లేపి ''ఉన్న పళాని నాతో రావాలి'' అనేసి రిక్షా ఎక్కేదాకా ఊరుకోలేదు.

సుకన్య పక్కన దర్జాగా రిక్షా ఎక్కి వెళ్తున్న రవణని చూసిన రెడ్లకుర్రోళ్ళకి మతులు పోయినియ్యి.

''మనం ఎంత కావాలన్నా పారేస్తాం రా ఒలే అంటే కాదంది మరి రవణగాడ్నేటి ఎగేసుకుపోతుంది'' అన్నాడు సముద్రారెడ్డి.

''అదే నాకూ అర్థం గావటం లేద''న్నాడు మేడ చెల్లాయమ్మగారి బుల్లబ్బులు.

''చాలా చిత్రంగా ఉందే'' అన్నాడు కోడిజుట్టు రాము.


''నీకంటే నాకెక్కువ విచిత్రంగా ఉంది...ఎందుకనడుగు. పదివేల కట్టమీదికి విసిరితే నన్ను వీధిలోకి విసిరేసింది'' అన్నాడు కర్రి నాగేంద్రప్రసాదు.

ఎవరినోటి కొచ్చింది వాళ్ళు మాట్లాడ్తున్నారు. మేడచెల్లాయమ్మగారి బుల్లబ్బులు మట్టుకు చాలా గట్టిగా ఆలోచిస్తున్నాడు. వాడికి సుకన్యంటే ప్రాణం. జీవితాంతం గడపడానికి ఎలాగా ఒప్పుకోదు. కనీసం ఒక్క రాత్రన్నా ఆ మనిషితో గడపాలన్న కోరిక ఎన్నాళ్ళనించో.

కాళ్ళ దగ్గరకొచ్చినోళ్ళని కసిరేసిన ఆ సుకన్య ఈ బక్క రవణగాడ్లో ఏముందని ఇంటికొచ్చి మరీ లాక్కెళ్తంది? ఏదో ఉంది రవణలో. ఏదీ లేకండా ఆ పని చెయ్యదామనిషి, ''రేపట్నుంచి ఆ ఊటుకూరి రవణగాడ్ని ఫాలో అవ్వాలి'' అనుకున్నాడు.


* * *

నిజమే కొమ్ములు తిరిగే గొప్పోళ్ళు మీసాలు మెలేసి రాజులూ సుకన్యకోసం పడిగాపులు గాస్తుంటే ఆ మనిషి ఈ రవణగాడి కోసం పడేడుస్తది. ఆడు పూట కనపడకపోతే గిలగిల్లాడిపోతా రిక్షా వేసుకుని పసలపూడొచ్చేస్తుంది. ఆడంటే మామూలు ఇష్టంగాదు పిచ్చి. మామూలు పిచ్చిగాదు మదపిచ్చి. వాళ్ళో ఏవుందా అని ఎంతమంది ఎన్ని విధాలుగా బుర్రలు బద్దలు కొట్టుకున్నా అర్థం గావడం లేదు.



ఎర్రపోతవరం వంతెన దిగితే ఎడం పక్కకి ఒక ఎర్ర కంకర్రోడ్డు వస్తుంది. ఆ రోడ్డులో ముందుకెళ్తే వస్తుంది అద్దంపల్లి. ఆ వూరోళ్ళంతా దుప్పట్లు నేస్తారు. భలే అందమైన దుప్పట్లు. పసుపు మీద నల్ల గళ్ళ దుప్పట్లు. పేడకసురు రంగు మీద నల్లగళ్ళ దుప్పట్లు. నలుపు మీద బత్తాయి పండు రంగు గళ్ళ దుప్పట్లు. వూరి మొత్తం మీద అవి నెయ్యడంలో ఆరితేరిన కుటుంబం చింతలపల్లి మల్లన్నగారిది. వాళ్ళ ఆఖరి అబ్బాయి శంకర్రావుతో రవణ చెల్లెలు పార్వతి పెళ్ళి నిశ్చయమైంది.

అయితే ఇద్దామనుకున్న పాతికవేల కట్నంలో పదివేలు తగ్గింది.



ఆ పదివేలకోసం కటకటలాడిపోతున్నాడు రవణ.

ఊళ్ళో రెడ్ల దగ్గర ఈనేత నేసేవాళ్ళకి పెద్ద విలువేం లేదు. అటుపక్క సోమేశ్వరం, ఇటు పక్క వెల్లా తెగ తిరుగుతున్న రవణకి ఎదురైన మేడచెల్లాయమ్మగారి బుల్లబ్బులు ఆ పదివేలూ నేను సర్దుతాను అని అర్జంటుగా సర్దేశాడు.

ఆ డబ్బేగాకండా అక్కడ్నించి రవణకి ఏ అవసరమొచ్చినా పాతికీ పరకా అయిదూ పదీ సర్దుతానే ఉన్నాడు. అలా డబ్బు చివరికి లెక్కగడితే ముందిచ్చిన పదితో పాటు కలుపుకుని పాతికయ్యింది మొత్తం.

కొన్నాళ్ళు గడిచినియ్యి.

సుకన్య కోరిక కొరికేస్తుంది బుల్లబ్బుల్ని. అదీ రవణగాడి దగ్గర ఎలా ఎత్తాలో అర్థం గాటంలేదు. ఎక్కడ సందు దొరుకుద్దా అని చూస్తున్నాడు.



ఈలోగా బుల్లబ్బులు మాడుగులలో ఉన్నప్పుడు మంచి దోస్తయిన గోవాడ శ్రీరామ్మూర్తి దగ్గర్నుంచి ఒక కబురొచ్చింది. అదికూడా సుకన్య గురించే. అదికూడా రవణగాడితో మాటాడాలి. ఎలాగో అర్థంగాటం లేదు.

ఊరి లాకులు దాటి ముచ్చుమిల్లి వెళ్ళే రోడ్లో రెండెకరాల పొలం ఉంది రవణకి. మొదటిపంట వచ్చేక చెల్లూరు వంతెన కిందున్న క్రిష్ణారైసుమిల్లుకి తోలి డబ్బు తీసేసుకుంటాడు.

పంట రైసుమిల్లుకి తోలేడని తెల్సి దాని ఓనరు రామకృష్ణారెడ్డిగారి దగ్గరకెళ్ళి ''ఆడు నాకు చాలా బాకీ, డబ్బులు ఆడికివ్వకండి మాయ్యా!'' అన్నాడు బుల్లబ్బులు. రామకృష్ణారెడ్డి బుల్లబ్బులుకి బంధువుకూడా అవడంతో రవణకెళ్ళే ఆ డబ్బు వెంటనే ఆపేసేడు.

దాంతో నెత్తీనోరూ బాదుకుంటా బుల్లబ్బుల్ని కల్సిన రవణ ''కూర్మాపురం అబ్బుగారి దగ్గర అప్పుతెచ్చి పెట్టి పెట్టుబడి పెట్టేను. ఇప్పుడారి తాలూకు మనిషొచ్చి పీకలమీద కూర్చున్నాడు'' అనేసి మొత్తుకోడం మొదలెట్టాడు.

''ఇప్పుడు నాకు అవసరమే చాలా అర్జంటుగా వచ్చి పడింది ఏం జేద్దాం'' అన్నాడు బుల్లబ్బులు.

''ఏదన్నా జెయ్యండిగానీ ఈ డబ్బులాపకండి రెడ్డిగారూ'' అనేసి బుల్లబ్బులు కాళ్ళట్టేస్కున్నాడు ఊటుకూరి రవణ.

''ఉండరాబాబూ'' అని రవణని పైకి లేపి ''అక్కడ నా పనీ అవ్వాలి...ఇక్కడ నీ పనీ అవ్వాలి... ఎలాగా? అని కాస్సేపు యాక్షను చేసి నాకో మంచి ఆలోచన తడతంది. సాయంకాలం గోపాలస్వామి గుడి అరుగుమీద కలుద్దాం మర్చిపోకుండా రావాలొరేయ్'' అన్నాడు.

అనుకున్న టైము కొచ్చేసేడు రవణ.

సుకన్య విషయం ఎలా మొదలెట్టాలో అర్థంగాక కాసేపు నాన్చి మొత్తం మీద ''ఒరే రవణా చోడవరం ముందు తగిలే గోవాడ తెల్సా?'' అన్నాడు.

''తెల్దు రెడ్డిగారూ!'' అన్నాడు రవణ.

''ఆవూళ్ళో సుగరు ఫేక్టరీ కూడా ఉంది. శ్రీరామ్మూర్తని ఒకషావుకారు ఏటా రెండొందల ఎకరాల చెరుకేస్తాడు. చాలా డబ్బునోడులే నాకు క్లోజు ఫ్రెండు'' అన్నాడు.

''ఇప్పుడా శ్రీరామ్మూర్తి గొడవ నాకెందుకు చెప్తున్నారు?'' అన్నాడు రవణ.

''వాడికి ఎన్నాళ్ళగానో మీ సుకన్య మీద కోరికట. వాళ్ళపొలంలో మాంచి గెస్ట్ హౌసుంది. ఆవిడ్ని తీసుకుని ఒకరోజు గోవాడ వచ్చావనుకో అయిదెకరాల పొలం రాస్తాడట. నాకు బాగా ఫ్రెండ్ గాబట్టి ఆ అయిదెకరాలూ నీపేర్న రాయించేస్తాను. సుకన్యంటే నీకు ప్రాణం అది నాకు తెల్సు సాయంత్రం లాకుల దగ్గర కలుసుకుందాం. ఈలోగా ఆలోచించుకో'' అనేసి వెళ్ళిపోయాడు.

బుల్లబ్బులు ప్లానేంటంటే గోవాడ శ్రీరామ్మూర్తి గెస్ట్హౌస్లో ఆడి తర్వాత బాగా తాగేసి ఉన్న సుకన్య దగ్గరకి తనెళ్ళిపోదామని.

అయిదెకరాల మీద చాలా ఆశపడిపోయిన ఊటుకూరి రవణ ఆ రాత్రి లాకుల దగ్గర కల్సుకున్నప్పుడు తన ప్రాణాన్ని అడ్డు పెడ్తున్నట్టు కాస్త నటించాకా ''సరే మరి ప్రయాణం ఎలాగా?'' అన్నాడు.

''రాజమండ్రిలోనో, కాకినాడలోనో, సుకన్యతో పాటు రైలెక్కి అనకాపల్లిలో దిగు. ఇంకో పెట్లోంచి నేనూ దిగుతాను. గోవాడనించి శ్రీరామ్మూర్తి నీకోసం స్టేషనుకొస్తాడు. మనం అనుకోకుండా కల్సుకున్నట్టు షావుకారు ముందు నటిద్దాం. సుకన్యని చూసి మతి పోగొట్టుకున్న శ్రీరామ్మూర్తి గోవాడలో పొలం మధ్య ఉన్న వాళ్ళ గెస్టవుస్కి రమ్మంటాడు. ముగ్గురం అక్కడి కెళతాం. తెల్లారాక పొలం తాలూకు పట్టాలు నీ

చేతిలో ఉంటాయి'' అన్నాడు.

''సరే'' అని అగులు గుద్దుకుంటా దెయ్యాలసుబ్బారావు రిక్షా ఎక్కి సుకన్య ఇంటికి బయల్దేరాడు రవణ.

అనకాపల్లికీ చోడవరానికీ మధ్యున్న గోవాడ గురించీ ఆవూళ్ళో రెండొందల ఎకరాల భూస్వామి శ్రీరామ్మూర్తి గురించీ చాలా గొప్పగా చెప్పడం మొదలెట్టాడు.

అలా చాలాసేపు చెప్పడం అయ్యేకా ''ఆ వూళ్ళో ఎకరం కనీసం ఆరులక్షలన్నా చేస్తది చెరుకు బాగా పండుద్ది, వరేస్తే ఎకరానికి నలభై బస్తాలకి తక్కువ దిగదు. మనం వెళ్ళి వాళ్ళ గెస్టవుస్‌లో ఒకరాత్రి విడిది చేస్తే అయిదెకరాలు రాస్తానంటున్నాడు. ఆ అయిదెకరాలూ అక్కడమ్మేసుకుని ఇక్కడ కొనుక్కుంటే ఒక స్థిరాస్తి ఏర్పడద్ది నీకు'' అని చెప్తుంటే అరచేత్తో ఆ రవణ నోరు మూసిన సుకన్య

''చూడు రవణా! నేను తల్చుకోవాలేగానీ నెలరోజుల్లో లక్షలకి లక్షలు డబ్బు సంపాయించగలను. అదంతా వదిలేయ్. నువ్వంటే నాకు ప్రాణం. చెప్పు నువ్వెక్కడికి రమ్మంటే అక్కడికొస్తాను. నువ్వే గంగలో దూకమంటే ఆ గంగలో దూకుతాను. కాబట్టి ఈడొంక తిరుగుడు యవ్వారం ఆపేసి నన్నేం చెయ్యమంటే అది చేస్తాను చెప్పు'' అంది.

గాలి తీసేసిన బుడగలా అయిపోయిన రవణ ''సరే'' అని బుల్లబ్బులు చెప్పింది మొత్తం చెప్పేసేడు.

''సరే ఎప్పుడు బయల్దేరదాం?'' అంది.

చెప్పేడు.

ఇద్దరూ బయల్దేరేరు.

అనుకున్నట్టే అనకాపల్లి స్టేషన్లో దిగడం ఆగోవాడ శ్రీరామ్మూర్తి పొలం మధ్య బోరింగు షెడ్లో మకాం పెట్టడం జరిగింది.

ఆ రాత్రి సుకన్యలో అద్భుతమైన రుచులు చూసిన గోవాడ శ్రీరామ్మూర్తి లోపలికి రావడానికి క్షణంకూడా సందు ఇవ్వలేదు బుల్లబ్బులుకి.

అన్నమాట ప్రకారం పొలానికి సంబంధించిన దస్తావేజులు ఇచ్చాడు శ్రీరామ్మూర్తి.

వాటిని పట్టుకుని పొలం ఎక్కడుందా అని వెతుక్కుంటూ వెళ్ళి చూస్తే ఆ పొలం ఉండే స్థలంలో నాలుగు దిగుడు బావులు వున్నాయి. వాటిని పూడ్చి పండించాలంటే ఎన్ని లక్షలవుద్దో లెక్క కట్టలేకపోయాడు ఊటుకూరి రవణ.

* * *